సిఫార్సు బదిలీలను రద్దు చేయాలి : ఎస్టీయూ

పుట్టపర్తి రూరల్, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు హరిప్రసాద్ రెడ్డి, కోనంకి చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీల్లో కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ సిఫార్సు బదిలీలకు ఉపక్రమించడం తగదన్నారు. గతేడాది మే నెలలో బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండానే సిఫార్సు బదిలీలకు తెరలేపడం సరికాదన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



చెట్టుపై పండుబారిన కాయలు

చెట్టుకింద రాలిన చీనీకాయలు





తురకలాపట్నంలో ఉల్లిగడ్డలను కోస్తున్న మహిళా కూలీలు

కరువు రైతుకు ధరాఘాతం తప్పట్లేదు. చీనీ, ఉల్లి ధరలు పాతాళానికి పడిపోవడంతో అన్నదాతలు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. పెట్టుబడులు కూడా దక్కట్లేదు. చీనీ చెట్లకు వ్యాధుల వ్యాప్తి, ధరల హెచ్చుతగ్గులు, నీటికొరతతో రైతులు కుదేలవుతున్నారు.

గతేడాది మార్చిలో టన్ను రూ.70వేల నుంచి రూ.80వేలు పలికిన చీనీ ధరలు ఇప్పుడు రూ.30 వేలు కూడా దాటట్లేదు. ధర కోసం ఎదురు చూస్తున్న రైతులకు వేసవిలో కూడా నిరాశ తప్పలేదు. నెలరోజుల వ్యవధిలో చీనీ ధర రూ.5వేలు మాత్రమే పెరిగింది. వేసవి మొదలవగానే ధరలు బాగా వస్తాయనీ, అప్పుడు అమ్ముకుందామని ఎదురుచూసిన రైతుకు నిరాశే ఎదురైంది. వేసవిలో కూడా ధరలు పెరగకపోవడంతో అమ్మకానికి సిద్ధమవుతున్నారు.

\- తాడిమర్రి

ధరాఘాతం!

చెట్టు దిగని చీనీ.. ఇల్లు దాటని ఉల్లి..

12 సార్లు మందులు కొట్టా



చీనీ పంట కాపునకు వదిలినప్పట్నుంచి కాయలు కోసే వరకు 12సార్లు విలువైన మందులు పిచికారీ చేశా. గతంలో నాలుగు సార్లు కొడితే చీనీ పంట చేతికి వచ్చేది. ఇప్పుడు పురుగు, తెగుళ్ల మందులకు ఎకరానికి రూ.15వేలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి ఎరువుల ఖర్చు అదనం.

\- వెంకటరామిరెడ్డి, చీనీ రైతు

కాయలు రాలుతుంటే చూడలేక అమ్మేశా

ధర కోసం ఎదురుచూసినా ఫలితంలేదు. కాయలు పక్వానికి వచ్చి రాలిపోయే దశకు చేరుకోవడంతో అమ్మేశా. ఈ ఏడాది ఎరువులు, మందుల ఖర్చులుపోనూ మిగిలింది ఏమీలేదు.



\- శ్రీరాములు, రైతు

గిట్టుబాటయ్యే పరిస్థితే లేదు..

తాడిమర్రి మండలవ్యాప్తంగా 3 లక్షలకు పైగా చీనీచెట్లు సాగులో ఉన్నాయి. చీనీ సాగులో జిల్లాలో తాడిమర్రి మండలం అగ్రస్థానంలో ఉంది. అందులో కూడా కునుకుంట్ల గ్రామంలోనే లక్షకుపైగా చీనీచెట్లను సాగు చేస్తున్నారు. ధరలు బాగా పలికితే కునుకుంట్ల రైతులు రూ.10కోట్లకుపైగా ఆర్జిస్తారు. రెండేళ్ల క్రితం జిల్లాలోనే అత్యధికంగా కునుకుంట్ల గ్రామంలో టన్ను రూ.1.15 లక్షదాకా అమ్మిన రైతులున్నారు. గ్రామ రైతులు చీనీపంటను కంటికి రెప్పలా కాపాడుకుని, నాణ్యమైన దిగుబడి సాధిస్తారు. ప్రస్తుతం ధరలను చూసి రైతులు దిగాలు పడుతున్నారు. గతంతో పోల్చితే చీనీ చెట్లకు మందులు కొట్టడం కూడా ఎక్కువైంది. కొత్తకొత్త తెగుళ్ల వ్యాపిస్తుండటంతో పంట చేతికి వచ్చే సమయానికి కనీసం 15 సార్లయినా విలువైన మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. లీటరు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు ధర చెల్లించి, మందులు కొడుతున్నారు. ఈ కష్టాలు చాలవన్నట్లు ఈ ఏడాది నీటి ఎద్దడి కూడా తోడైంది. ఖరీఫ్ సీజన్‌లో మండలవ్యాప్తంగా సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో ఇప్పటికే భూగర్భజల మట్టం తగ్గిపోతోంది. అరకొరగా వస్తున్న నీటిని విడతల వారీగా చీనీ చెట్లకు వదిలి పంటను కాపాడుకుంటున్నారు. ప్రస్తుత ధరలను బట్టి చూస్తే రైతులకు ఏ మాత్రం గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. కాపు ఎక్కువగా ఉన్న చెట్లకు చాలినంత నీరు అందక ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. మరికొన్ని తోటల్లో కాయలు పండుబారి రాలిపోతున్నాయి. అయినా రైతులు ధర కోసం ఎదురుచూడక తప్పడం లేదు. టన్నుపై మరో రూ.5వేలు పెరిగినా తోటపైన కనీసం రూ.50వేలు అదనంగా వస్తుందని రైతులు భావిస్తున్నారు.



చీనీ తోట



చీనీకాయలను కుప్పగా పోసిన దృశ్యం



గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- తెగుళ్లతో పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు
- పాతాళంలో ధరలు
- పెట్టుబడి కూడా దక్కని దుస్థితి
- అన్నదాతకు తప్పని నష్టం

నీరు తగ్గి తిప్పలు



12 ఏళ్లుగా చీనీచెట్లను సాగుచేస్తున్నా. ఈసారి భూగర్భజలం అడుగంటిపోయింది. బోరులో నీరు తక్కువగా వస్తోంది. ఆ అరకొర నీటితోనే చీనీ పంటను కాపాడుకుంటున్నా.

\- ఓబులేసు, రైతు

కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి

రొద్దం :

ఉల్లి రైతు కంట కన్నీరు వస్తోంది. పంటకు గిట్టుబాటు ధరల్లేక నష్టపోతున్నాడు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లి పంటకు ధరలు లేక పెట్టుబడులు చేతికందక గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని చిన్నకోడిపల్లి, తురకలాపట్నం, సానిపల్లి, కోగిర, చోళేమర్రి, ఎల్‌జీబీ నగర్, ఆర్ మరువపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఉల్లి సాగుచేశారు. ఎకరానికి పెట్టుబడి కింద రూ.40వేలు ఖర్చు పెట్టారు. తురకలాపట్నం గ్రామానికి చెందిన యువరైతు సురేష్ రెండెకరాల్లో ఉల్లి సాగుచేయగా.. రూ.80వేలు పెట్టుబడి కింద ఖర్చయింది. రెండెకరాలకు ఐదు కిలోల విత్తనం చొప్పున రూ.10వేలు ఖర్చుకాగా.. సాగుకు కూలీలు, ఎరువులు, మందుల పిచికారీ కింద రూ.20వేలు పెట్టుబడి పెట్టారు. చీడ పీడల కారణంగా పంట దిగుబడి 3 టన్నులలోపే వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో ధర కూడా దారుణంగా ఉంది. కిలో రూ.10కి అమ్ముడుపోతోంది. ఈ ధరకు విక్రయిస్తే రూ.30 వేలు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. రూ.80 వేలు పెట్టుబడి పెడితే రూ.30 వేలు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రూ.50 వేలు నష్టం తప్పదని రైతు వాపోతున్నాడు.

సాగుకు దూరంగా సానిపల్లి

ఒకప్పుడు సానిపల్లి ఉల్లిపంటకు జిల్లాలోనే ప్రసిద్ధి. టీడీపీ హయాంలో హార్టికల్చర్ కింద ఉల్లి రైతును ప్రభుత్వం ప్రోత్సహించింది. సబ్సిడీపై విత్తనాలు, డ్రిప్ అందించి, పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి, ఆదుకుంది. వైసీపీ హయాంలో గిట్టుబాటు ధర రాకపోవడంతో సానిపల్లి రైతులు ఉల్లిపంట సాగుకు దూరమయ్యారు. గ్రామస్థులు ఒకప్పుడు 200ఎకరాల దాకా ఉల్లి సాగుచేసేవారు. ప్రస్తుతం 20 ఎకరాలు కూడా సాగులో లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉల్లి రైతును ఆదుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి సానిపల్లికి వ్యాపారులు వచ్చి, ఉల్లి దిగుబడిని కొనుగోలు చేసేవారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సానిపల్లి రైతులు ఉల్లి పంటను సాగుచేయడం మానేశారు.

19 నుంచి బ్రహ్మోత్సవాలు

- పక్షం రోజులపాటు సంబరాలు
- స్వామికి విధి వాహనసేవలు
- పులకించనున్న కదిరి

ఖాద్రీశుడి వైభవం..



వివరాలు 7లో..

ఉద్యోగాలను అమ్మేశారు

- నిరుద్యోగులకు ప్రభుత్వం అన్యాయం
- టీడీపీ నాయకుల ధ్వజం.. పురంలో నిరసన



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 15: వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరుకుల్లా అమ్మేశారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగాలివ్వకుండా యువత జీవితాలను సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీలో 150కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని మండిపడ్డారు.. డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు రూ.2.5కోట్లు, డీఎస్పీకి రూ.1.5కోట్లు రేటు కట్టి, అమ్మడం నిజం కాదా ప్రశ్నించారు. 30 డిప్యూటీ కలెక్టర్, 25 డీఎస్పీ పోస్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. ఏపీపీఎస్సీ కార్యదర్శిని బాధ్యతల నుంచి తప్పించి సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్ సతీష్, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుడు మోసపోరాదు: డీఎస్ఓ



జ్ఞాపికను అందజేస్తున్న డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి

పుట్టపర్తి, మార్చి 15: నాసిరకం ఉత్పత్తులతో వినియోగదారుడు మోసపోరాదని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్ఓ) వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మాట్లాడుతూ.. ఏ వ్యాపారికైనా వినియోగదారుడు మూలస్తంభమన్నారు. వినియోగదారుడే లేకపోతే వ్యాపార సంస్థలు మనుగడ సాగించలేవన్నారు. వినియోగదారుడి పట్ల చిన్నచూపు తగదన్నారు. వ్యాపారి ఆర్థిక ప్రగతి సాధించడంలో వినియోగదారుడే కీలకమన్నారు. ఈ విషయాన్ని గ్రహించి, గౌరవించాలన్నారు. వినియోగదారుడి హక్కుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం వినియోగదారుల హక్కుల పరిరక్షణ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రమేశ్, డాక్టర్ గోపాల్‌రెడ్డి, తూనికలు, కొలతల అధికారి శివశంకర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు




	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 శనివారం (సాయంత్రం)	5.05 ఆదివారం (ఉదయం)
కదిరి	6.30 శనివారం (సాయంత్రం)	5.11 ఆదివారం (ఉదయం)
ధర్మవరం	6.35 శనివారం (సాయంత్రం)	5.08 ఆదివారం (ఉదయం)
హిందూపురం	6.33 శనివారం (సాయంత్రం)	5.12 ఆదివారం (ఉదయం)
పెనుకొండ	6.31 శనివారం (సాయంత్రం)	5.10 ఆదివారం (ఉదయం)

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 15: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 41 కేంద్రాల్లో శుక్రవారం ద్వితీయ సంవత్సర కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8,757 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా... 327 మంది గైర్హాజరయ్యారు. 8,430 మంది పరీక్షలు రాశారని ఆర్ఐఓ వివరించారు.

మందు మోపు



- వైసీపీ ఇన్‌చార్జిలు, నేతల ముందుజాగ్రత్త

వైసీపీ అధినేత, సీఎం జగన్ ఎన్నికలకు సిద్ధం అని అంటుంటే ఆ పార్టీ ఇన్‌చార్జిలు, టిక్కెట్ ఆశావహులు మద్యం సిద్ధం అంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోగా మద్యం సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. నేడో.. రేపో.. నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు ముందుచూపు చూసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ వస్తే కర్ణాటక మద్యాన్ని తెచ్చుకునేందుకు ఇబ్బందవుతుందని భావించిన కొంతమంది నేతలు ముందుగానే ఆయా మండలాలకు తరలించి, నిలువ చేస్తున్నట్లు సమాచారం. ఓటర్లను తమ దారిలోకి తెచ్చుకోవాలంటే పలురకాల ప్యాకేజీలతో ఆకర్షిస్తుంటారు. చేతిలో నోటు పెట్టినా సంతృప్తి చెందని ఓటర్లు సైతం మద్యానికి జై కొడతారు. అందుకే ప్రతి ఎన్నికల సమయంలో పోలింగ్‌కు వారం 15 రోజులు ముందుగానే మద్యం కొనుగోలు చేస్తుంటారు. ఈ దఫా అధికార పార్టీ నాయకులు ముందుగానే మద్యం కొనుగోలు చేసి, నిలువ ఉంచుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇప్పటికే మద్యం నిలువలను మండలస్థాయికి పంపినట్లు సమాచారం. నామినేషన్ల పర్వం ప్రారంభం కాకముందే మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టేలా సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

\- హిందూపురం

- కోడ్ కూయకనే మద్యం.. సిద్ధం..
- భారీగా కర్ణాటక నుంచి దిగుమతి
- అక్కడి షాపులకు లక్షల్లో డిపాజిట్లు

మద్యం షాపుల్లో డిపాజిట్లు

ఏపీలో మద్యం ధరలు ఎక్కువ. దీంతోపాటు ఇక్కడ రకరకాల పేర్లతో కల్తీ మద్యం అమ్ముతున్నారు. దీంతో కర్ణాటక మద్యంపైనే మందుబాబులు ఆసక్తి చూపుతారు. ఎన్నికలు దగ్గరపడితే ధరలు పెరుగుతాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. దీంతో కర్ణాటకలో మందు కొనుగోలుకు రూ.లక్షల్లో డిపాజిట్ చేసినట్లు సమాచారం. కర్ణాటక సరిహద్దులోని ఒక్కో మద్యం షాపులో ఇప్పటికే ఓ అధికార పార్టీ నేత రూ.50 లక్షలు డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. ఇలా మూడుచోట్ల డిపాజిట్ చేసి కొంత మొత్తానికి సంబంధించి మూడు మండలాలకు మద్యం దిగుమతి చేసుకున్నారు. కర్ణాటకకు ఆనుకుని ఉన్న మండలంలో ఇప్పటికే మూడుచోట్ల నిలువ చేసినట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి తోటలో మద్యం నిలువ ఉంచారన్న విమర్శలున్నాయి. మరో మండలంలో ఫాంహౌస్‌లో డంప్ చేసినట్లు సమాచారం. దీంతో కర్ణాటకకు చెందిన కొంతమంది మద్యం షాపుల యజమానులు.. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులను నేరుగా కలిసి, తక్కువ ధరకే మద్యం పంపుతామని ఒప్పందాలు చేసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్య నేతలు ఈ మద్యం సరఫరాను వారి వద్దనున్న అనుచరగణానికి అప్పగించినట్లు తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు

ఇప్పటికే ఎన్నికల అధికారులు మద్యంపై నిఘా ఉంచాలనీ, భారీఎత్తున నగదు తరలిస్తే పట్టుకోవాలని ఆదేశాలున్నాయి. ఒకట్రెండు చోట్ల మినహా ఎక్కడా అధికారుల తనిఖీలు కనిపించట్లేదన్నది నిర్వివాదాంశం. ఇప్పటికీ పూర్తిస్థాయిలో వాహన తనిఖీలు కనిపించలేదు. జిల్లాలోని ఆరేడు నియోజకవర్గాలకు కర్ణాటక నుంచే మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం. అయినా.. జిల్లాలో కర్ణాటక మద్యం భారీఎత్తున పట్టుబడిన దాఖలాల్లేవు. ముందస్తుగా సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చే తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ మద్యం వచ్చే వాహనాన్ని అధికారులు ఆపకుండా పంపుతున్నట్లు విమర్శలున్నాయి.



పెద్దఎత్తున నిల్వ

ఎన్నికల కోడ్ వచ్చాక అధికారులుగా బయటి వ్యక్తులు వస్తారు. అప్పుడు తమ పని సాఫీగా సాగదనీ, ఇప్పుడున్న వారైతే నోరువిప్పరని వైసీపీ నేతలు భావిస్తున్నారు. దీంతో ముందుగానే కర్ణాటక నుంచి మద్యం దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. గతవారం జాతీయ రహదారి మీదుగా జిల్లాలోని ఓ నియోజకవర్గానికి మద్యం తరలించే వాహనం పట్టపగలే వెళ్లినా తనిఖీలు చేయకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులకు ముందుగానే సమాచారం ఉన్నట్లు తెలుస్తుంది. ఆ వాహనం కర్ణాటక స్టాక్ పాయింట్ నుంచి నేరుగా జిల్లాలోకి ప్రవేశించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన మూడు, నాలుగు నియోజకవర్గాల అధికార పార్టీ నాయకులు ముందుగానే ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లి, నిలువ ఉంచినట్లు తెలిసింది.



ప్రభుత్వ భూములను కాపాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



మాట్లాడుతున్న ఇంతియాజ్

పుట్టపర్తి రూరల్, మార్చి 15: పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల పరిధిలో కబ్జా కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రశాంతి గ్రామంలోని సీపీఎం కార్యాలయంలో ఇంతియాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలు.. ఆక్రమణలను అడ్డుకునే దిశగా చొరవ చూపకపోవడంతో కబ్జాదారులు ఎకరాల కొద్దీ భూమి స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. కొత్తచెరువు పరిధి సర్వే నంబరు 483-1లో 164 ఎకరాలు, పుట్టపర్తి మండలం ఎనుములపల్లి సర్వే నంబర్లు 454-2, 454-3, 454-6లో కోట్ల విలువ చేసే 3.6 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఆక్రమించారని ఆరోపించారు. వాటిలో పెద్దపెద్ద భవంతులు, వాటిలో స్విమ్మింగ్‌పూల్స్ కూడా కడుతున్నారన్నారు. ఓ వ్యక్తి ఏకంగా ఐదు అంతస్తుల భవనం నిర్మించాడన్నారు. కప్పలబండ పొలం సర్వేనంబర్ల 127-3, 127-3బీ, 127-2, 195-4, 195-5లో 14.61 ఎకరాల భూమిని కబ్జా చేశారన్నారు. సర్వే నంబరు 308-లో 13.32 ఎకరాలు కబ్జా కోరల్లో చిక్కుకుందన్నారు. ఈ భూములను ఉన్నతాధికారులు కాపాడాలని కోరారు. లేదంటే ప్రభుత్వ ఆస్తులను పేదలకు పంచడానికి సీపీఎం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.

మినీమేనిఫెస్టోతో అన్ని వర్గాలకు లబ్ధి

● ఇంటింటి ప్రచారంలో కందికుంట యశోదాదేవి



కుటాగుళ్లలో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి తదితరులు

కదిరి, మార్చి 15: చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కదిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందికుంట యశోదాదేవి తెలిపారు. పట్టణంలోని కుటాగుళ్ల 36వ వార్డులో శుక్రవారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో గురించి వివరించారు. ఈ పథకాల వల్ల అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పల్లె సింధూర భారీ ర్యాలీ

● పుట్టపర్తిలో ఎన్నికల ప్రచారం ప్రారంభం
● పెద్దఎత్తున తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

పుట్టపర్తి, మార్చి 15: నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా పట్టణంలోని సత్యమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, భర్తపల్లె వెంకటక్రిష్ణకిశోర్‌తో కలిసి ప్రచార రథం ద్వారా భారీ ర్యాలీ నిర్వహించారు. కర్ణాటకనాగేపల్లి నుంచి పుట్టపర్తి, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, ప్రశాంతి గ్రామం వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో అడుగడుగునా మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిన తెలుగుతమ్ముళ్లు

నల్లమాడ: మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇందులో పాల్గొనేందుకుగాను మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో బైకులలో తరలివెళ్లారు.

భారీ మెజారిటీతో గెలుస్తా..

పుట్టపర్తి: నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 27ఏళ్లుగా తన మామ పల్లె రఘునాథ రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తూ, ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు. ప్రజలతో పాటు ఆయన ఆశీస్సులతో ఈ సారి నేను భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని పేర్కొన్నారు. గెలిచిన వెంటనే నియోజకవర్గంలో193 చెరువులు నింపడమే తన ధ్యేయంగా పని చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రతి గ్రామానికి తాగునీరు అందించడానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి పాటు పడతానన్నారు. తనకు టిక్కెట్ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



పుట్టపర్తిలో పల్లె సింధూర ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



ర్యాలీకి వస్తున్న నల్లమాడ మండల తెలుగు తమ్ముళ్లు

వడదెబ్బపై అవగాహన



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఏ నగేష్

పుట్టపర్తి రూరల్, మార్చి 15: ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య సూచించారు. పట్టణంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, ప్రజలు బయట తిరగడం అంత మంచిది కాదని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. కాటన్‌దుస్తులు ధరించాలని, తరుచూ నీటిని తీసుకోవాలని చెప్పారు. అలాగే కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణయ్య, సచివాలయం సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు , ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

ధర్మవరం, మార్చి 15: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించినట్టు అధ్యాపకురాలు చిట్టెమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1989 మార్చి 15వ తేదీ నుంచి భారత ప్రభుత్వం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుతోందన్నారు. వినియోగదారులకు ఎలాంటి హక్కులు ఉంటాయి, వస్తువుల నాణ్యత, సామర్థ్యం, ధర ప్రమాణాలకు సంబంధించి సమాచారాన్ని విద్యార్థులతో పాటు పలువురు వినియోగదారులకు వివరించామన్నారు. అలాగే మార్కెట్‌లో జరిగే మోసాలు, అన్యాయాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పామన్నారు. తర్వాత విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పుష్పావతి, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, స్వామి, ఆనంద్, సరస్వతి, సౌజన్యలక్ష్మీ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



తనకల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తనకల్లు, మార్చి 15: తనకల్లు మండలకేంద్రంతో పాటు కొక్కంటి క్రాస్‌లో శుక్రవారం ఎస్ఐ ధరణి బాబు ఆధ్వర్యంలో పో లీసులు కవాతు నిర్వహించారు. త్వరలో సా ధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజ ల్లో భయం, ఆందోళనలు తొలగించి ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు మేమున్నామంటూ ధైర్యం కల్పించేందుకు గాను ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఓటర్లు ఏవైనా సమస్యలుంటే నేరుగా పోలీసులను సంప్రందించాలని కోరారు. ఎవరూ కూడా ప్రలోభాలకు గురికాకూడదన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి.. 24గంటలు నిఘా ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం



ప్రశంసాపత్రాలతో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

నల్లమాడ, మార్చి 15: మండలకేంద్రంలోని పాత బాలాజీ పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరంలో జరిగిన జంప్‌రోప్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, కోకో తదితర క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలలో పాల్గొని ప్రతిభ కనబరచారు. ఈ విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాల డైరెక్టర్ వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ స్వర్ణలత సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతియేడాది తమ పాఠశాల నుంచి కొంతమంది క్రీడల్లో పాల్గొని ప్రథమస్థానాల్లో గెలుపొందారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానించడంతో పాటు, ప్రశంసా పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

విషపురుగు కాటుతో పాడి ఆవు మృతి

తనకల్లు, మార్చి 15: మండలంలోని గుంజువారిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ వ్యవసాయం, పాడి ఆవుల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. కాగా శుక్రవారం ఉదయం పాడి ఆవును ఇంటి బయట కట్టేశాడు. కొద్ది సేపటికి ఆవు శరీరమంతా పచ్చగా మారి మృతి చెంది పడి ఉంది. రైతు పరిశీలించి పాముకాటు వేసినట్లు గుర్తించాడు. రెండురోజులక్రితం ఇదే రైతుకు చెందిన ఒక పాడి ఆవు మృతిచెందింది. ఇప్పుడు మరో ఆవు కూడా మృతిచెందడంతో ఆ రైతు కుటుంబం ఆవేదనకు లోనయ్యారు. రెండురోజుల వ్యవధిలోని రెండు ఆవులు మృతిచెందడంతో రూ.లక్ష 50వేలు నష్టం జరిగిందని రైతు వాపోయారు. చెందారు. ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరారు.

ఐదు పథకాలపై కాంగ్రెస్ ప్రచారం

కొత్తచెరువు, మార్చి 15: కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఐదు పథకాల అమలుపై ఆ పార్టీ నాయకులు శుక్రవారం కొత్తచెరువులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బెల్లంనజీర్‌గాంధీ మాట్లాడుతూ.. వచ్చేఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఐదు పథకాలు అమలవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరనారాయణ, మోహన్, సనావుల్లా, ఇమ్రాన్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

● రాజకీయ పార్టీల నాయకులను కోరిన ఆర్డీఓ



ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ వెంకట శివారెడ్డి

ధర్మవరం, మార్చి 15: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీనాయకుల సహాయసహకారాలు అందించాలని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివారెడ్డి కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లపై రాజకీయ నాయకులు కూడా పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల విధివిధానాలపై పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ఆర్డీఓ స్వయంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్‌యూనిట్, వీవీప్యాట్లు పనిచేసే విధానం గురించి ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహసీల్దార్‌రమేశ్‌బాబు, నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ షణ్ముకయాదవ్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి

● ఏయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు

పుట్టపర్తి, మార్చి 15: ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అబ్దుల్‌కలాం షాదీఖానాలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి అధ్యక్షతన సమావేశం జరగ్గా.. రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు మాటాడారు. ప్రస్తుతం సమాజంలో పురుషులతో దీటుగా మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత ప్రజా రవాణా ఉద్యోగులకు ఎర్న్ లివు కింద రూ.600 కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. వీటిని తక్షణమేచెల్లించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు, మెడికల్ బిల్లులు, చనిపోయిన వారికి సంబంధించిన బిల్లులు, రిటైర్ట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని , మహిళా ఉద్యోగులకు నెలసరి మూడు రోజులు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, రమణప్ప, శ్రీనివాసులు, ముత్యాలప్ప, రమేశ్‌బాబు, చెన్నప్ప, బాబు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

ధర్మవరం, మార్చి 15: పట్టణంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం టికెట్ కేటాయించాలని కోరుతూ ఈ బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9:30గంటలకు కాలేజీ సర్కిల్ వద్దకు నియోజకవర్గంలోని టీడీపీశ్రేణులందరూ తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

నాటుసారా ఊట ధ్వంసం

కదిరిఅర్బన్, మార్చి 15: మండలంలోని మరవతండా అటవీ ప్రాంతంలో నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్ఐ ఏతిరాజులు తెలిపారు. తమ సిబ్బందితో కలిసి శుక్రవారం మరవతండా ప్రాంతంలో దాడులు నిర్వహించి మూడువందల లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎవరైనా నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా: డీఎస్పీ

మడకశిరటౌన్, మార్చి 15: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో గట్టి నిఘా ఉంచుతామని పెనుకొండ డీఎస్పీ షేక్ బాబ్జాన్ సయ్యద్, కర్ణాటక డీఎస్పీలు శేఖర్, రామచంద్రప్ప అన్నా రు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం సరిహద్దు ప్రాంతాల పోలీసులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. సీఐలు మ నోహర్, రా జశేఖర్‌తోపాటు, ఆంధ్ర,కర్ణాటక సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కదిరి అర్బన్, మార్చి 15: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతమ్మ పేర్కొన్నారు. మండలంలోని కదిరి బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిహార మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో ప్రభావతమ్మ పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా రక్తహీనత లాంటివి రాకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుషీద్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఆత్మారెడ్డి

కదిరి, మార్చి 15: పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా.. ఆ సంఘం నాయకుడు ఆత్మారెడ్డి ఎన్నియ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నికలు నిర్వహించి, కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కదిరిఅర్బన్, మార్చి 15: మండలపరిధిలోని కుమ్మరవాండ్లపల్లి కదిరి కొండ ప్రాంతంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కొండవద్ద మృతదేహాన్ని గుర్తించి, స్థానికులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే సంఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడికి 40 సంవత్సరాల వయసుంటుందన్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. మృతి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

సూపర్‌సిక్స్‌పై విస్తృత ప్రచారం



సూపర్‌సిక్స్‌పథకాలపై ప్రచారంచేస్తున్న టీడీపీ శ్రేణులు

కొత్తచెరువు, మార్చి 15: మండల కేంద్రంలోని ధర్మవరం రహదారిలో శుక్రవారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. అనంతరం సీనియర్ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో డ్వాక్రా గ్రూపులను ఏర్పాటుచేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఒలిపిశీన, డిపోభాస్కర్, చికెన్‌సెంటర్ వెంకటేశ్, హర్ష, రాహుల్, బాషా, మారుతీరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, అడవిశంకర్, పెద్దన్న, చిన్నప్పయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మవరంరూరల్, మార్చి15: మండలంలోని కుణుతూరు వద్ద శుక్రవారం ఓ యువకుడు తన ద్విచక్రవాహనంలో వెళుతూ చెట్టును ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలాలా ఉన్నాయి. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన చందు(26) మరూరు టోల్‌ప్లాజ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే అతను వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంలో శుక్రవారం ధర్మవరానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గంమధ్యలోని కుణుతూరు వద్దకు రాగానే జగనన్న లేఅవుట్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టును అదుపుతప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలవడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



గాండ్లపెంట పోలింగ్ కేంద్రంలో డీఎస్పీ శ్రీలత

గాండ్లపెంట, మార్చి 15: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ శ్రీలత శుక్రవారం పరిశీలించారు. కమతంపల్లి, కటారుపల్లి, ద్వారనాల, గాండ్లపెంట, తూపల్లి లలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అక్కడి మౌలిక సదుపాయాలపై ఎస్ఐ కృష్ణవేణితో ఆరా తీశారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

గోనుగుంట్లను కలిసిన ఎస్సీకాలనీవాసులు



గోనుగుంట్లను కలిసిన ఎస్సీకాలనీ వాసులు

ముదిగుబ్బ, మార్చి 15: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన 10 కుటుంబాల వారు శుక్రవారం మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణను కలిశారు. అనంతపురంలో గోనుగుంట్ల స్వగృహంలో వారు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. త్వరలో మీరు చేపట్టే ముదిగుబ్బ పర్యటనలో తాము బీజేపీలోకి చేరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గణపర్తి రమేశ్, గోనుగుంట్ల బాలభాస్కర్, గుంజేపల్లి నారాయణస్వామి ఉన్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన



గాండ్లపెంట జెడ్పీహై స్కూల్లో బల్లలను పరిశీలిస్తున్న ఎంఈఓ

గాండ్లపెంట, మార్చి 15: ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించి ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎంఈఓ కృష్ణానాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి మౌలిక వసతులైన బల్లలు, తాగునీరు, ఫ్యాన్లను పరిశీలించారు. తర్వాత మాట్లాడుతూ మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 288మంది, కటారుపల్లి కేజీబీవీలో 108 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. వీరిలో 49మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పల్లె సింధూరకు ఘన స్వాగతం



బుక్కపట్నం వద్ద హారతులు పట్టి స్వాగతిస్తున్న మహిళలు

బుక్కపట్నం, మార్చి 15 : నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి మండలంలోకి అడుగు పెట్టడంతో నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గజమాలతో సన్మానించారు. అనంతరం ఆమె మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు భర్త వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డి, జనసేన సమన్వయ కర్త చంద్రశేఖర్, భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలున్నారు.

ఇంటిలో చోరీ


● 3 తులాల బంగారు, 10 తులాల వెండి, రూ. 70 వేల నగదు అపహరణ




చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్

నంబులపూలకుంట, మార్చి 15: మండలకేంద్రంలోని గ్రంథాలయం సమీపంలో గల లోకేశ్వర్‌రెడ్డి ఇంటిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోకేశ్వర్‌రెడ్డి స్థానికంగా బేకరీని నడుపుతున్నాడు. ఆయనతో పాటు ఆయన భార్య కూడా బేకరీలోనే ఉంటూ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో వారి ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు పసిగట్టారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో మండలకేంద్రంలో కరెంట్ పోయింది. ఇదే అదునుగా దొంగలు ఆ సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువా పగులకొట్టి అందులోని 3 తులాల బంగారు, 10 తులాల వెండి, రూ. 70 వేల నగదు అపహరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఐ శేఖర్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో తనిఖీ చేయించారు.

ఖాద్రీశుడి వైభవం


ఆలయం వ్యూ


లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాదుడి మూలవిరాట్లు


ధ్వజస్తంభం


పవిత్రమైన పాలబావి

- 19నుంచి బ్రహ్మోత్సవాలు
- పక్షం రోజులపాటు సంబరాలు
- శ్రీవారికి వివిధ వాహనసేవలు
- పులకించనున్న కదిరి

కోరిన కోర్కెలు తీర్చే దేవుడు, కాటమరాయుడిగా పేరుగాంచిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఈనెల 19వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఏటా పాల్గుణ మాసంలో పక్షంరోజులపాటు సాగే ఈ ఉత్సవాలను సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల నమ్మకం. అందుకే వీటిని బ్రహ్మోత్సవాలు అని పిలుస్తారు. ఈనెల 19న ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తాయి. ఈ పక్షంరోజులూ శ్రీవారు రోజుకో అవతారంలో దర్శనమిచ్చి, భక్తులకు కనువిందు చేస్తారు. దేశంలోని నవ నారసింహ క్షేత్రాల్లో ఒక్కటైన కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది.

- కదిరి

మూలవిరాట్టు ఎంతో ప్రత్యేకం

నారసింహక్షేత్రాలకు భిన్నంగా కదిరిలో స్వయంభువుగా వెలసిన శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో కొలువుదీరారు. అష్టభుజుడైన నారసింహుడు దుష్టరాక్షసుడైన హిరణ్య కశిపుడిని తన తొడలపై పరుండబెట్టుకుని రెండు హస్తాలతో అతడి శిరస్సు, పాదములను అదిమిపట్టి, మరో రెండు హస్తములతో వజ్రతీక్షణములగు గోళ్లతో రాక్షసుడి వక్షస్థలమును చేదిస్తుండగా.. మిగిలిన నాలుగుహస్తముల్లో శంఖు, చక్ర, ఖేడ్య, ఖడ్గములను ధరించి ప్రహ్లాద సమేతంగా దర్శనమిస్తారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన మరో ఆలయంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. అభిషేకం అనంతరం శ్రీవారి వక్ష స్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం ఇక్కడి మరో ప్రత్యేకత.

కదిరి ప్రాంతంలో ముహూర్తాలు బంద్

ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిగిన నాటి నుంచి ఈ ప్రాంతంలో వివాహాలు బంద్ అవుతాయి. నారసింహుడి కల్యాణానికి ఎదురు కల్యాణమా అని ప్రశ్నించే వారు కూడా ఈ ప్రాంతంలో చాలామంది కనిపిస్తారు. అందుకే ముహూర్త బలాలు ఎలా ఉన్నా బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాతే శుభకార్యాలను నిర్వహిస్తారు. ఈ పక్షం రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.


కదిరి మల్లెల గుబాళింపు...

కదిరి మల్లెల గుబాళింపునకు దేశంలోనే పేరుంది. ఇక్కడి మల్లెలు వెదజల్లినంతగా ఏప్రాంత మల్లెలు సువాసనలు ఇవ్వలేవన్న పేరు ఉంది. బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింత సువాసనలు గుబాళిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో మాత్రమే కన్పించే ధవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి ధవణాన్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. ఇటీవలి కాలంలో కదిరి ధవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు.

కోనేటి స్నానం.. పాప విమోచనం

ఆలయానికి పడమర భాగాన, అర్జున నది ఒడ్డున భృగుతీర్థం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి శ్రీవారిని స్మరించుకున్నారు. ఆ మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు అందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పటికీ బ కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. భక్తులు తొలుత భృగుతీర్థంలో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటే సర్వ పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.

చూడదగ్గ ప్రదేశాలు


తిమ్మమ్మ మర్రిమాను

శ్రీఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్నఅనంతరం భక్తులు చూడాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ. దూరంలో గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని దర్శించుకోవచ్చు. అత్యంత విశాలమైన వటవృక్షంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం, గూటిబైలు వద్ద ఉంది. కదిరి-హిందూపురం రహదారిలో పాలబావి వెలసి ఉంది. ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఎండిపోకపోవడం, మండుటెండల్లో పొంగిపొర్లడం దీనిప్రత్యేకం.

అంకురార్పణతో మొదలు..

పదిహేను రోజులపాటు సాగే బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. కల్యాణోత్సవం నాటి నుంచి రోజూ ఓ ప్రత్యేక అవతార రూఢుడై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఏడాదిలో అన్నిరోజులు ఆలయంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీవారు భక్తుల చెంతకే వెళ్లి దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకం. 19న అంకురార్పణ, 20న కల్యాణోత్సవం, 21న హంసవాహనం, 22 సింహ వాహనం, 23న హనుమంత వాహనం, 24న బ్రహ్మగరుడసేవ, 25న శేషవాహనం, 26న సూర్య, చంద్రప్రభలు, 27న మోహినీ ఉత్సవం, 28న ప్రజాగరుడ సేవ, 29న గజవాహనం, 30న బ్రహ్మరథోత్సవం (తేరు), 31న అలుకోత్సవం, 1న తీర్థవాది, 2న పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఖాద్రి అంటే...

శ్రీ మహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నారసింహుడు వెలసిన కదిరి పట్టణ పూర్వ నామం ఖాద్రీపురం. ఖ అంటే విష్ణు పాదం అని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. నారసింహుడు ఈ ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రి అన్న పేరువచ్చిందనేది నమ్మకం. మరో పురాణ గాథ కూడా ప్రచారంలో ఉంది. 'ఖదిర' అనే పేరుగల చంద్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రి అన్న పేరు వచ్చింది. కృతయుగంలో ఉద్భవించిన లక్ష్మీనారసింహుడి కోసం పట్నం పాలేగాళ్లు 10వ శతాబ్దానికి ముందే ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్లున్నాయి. ప్రస్తుతం నారసింహుడి ఆలయం ఉన్నచోట 10వ శతాబ్దం మధ్యకాలంలో పశ్చిమ చాళక్య రాజవంశీకులు.. దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. 1245లో హరిహరరాయలు, బుక్కరాయలు నృసింహుడి సాలగ్రామాలను, అచ్యుతరాయలు అష్టభుజుడైన నృసింహుడి మూలవిరాట్, ఉత్సవమూర్తులను దుర్గాదేవి ఆలయంలో ప్రతిష్ఠించడంతో లక్ష్మీనారసింహుడి క్షేత్రంగా పేరొందింది. భృగుతీర్థంలో మునిగి ఉన్న ఉత్సవమూర్తులను వసంత రుతువులో వెలికి తీసి ప్రతిష్ఠించడం కారణంగా శ్రీవారిని వసంత వల్లభుడు అని కూడా పిలుస్తారు. మహాభక్తులైన 12 మంది అళ్వార్‌లు రంగ మంటపాన్ని, కొక్కంటి పాలెగాళ్లు పడమర గోపురాన్ని, తాడిపత్రి పాలెగాళ్లు కోటాయి మంటపాన్ని నిర్మించారు.


ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం

రేపు గ్రూప్-1 పరీక్షలు

- 11,597 మంది అభ్యర్థులు.. 33సెంటర్లు
- పకడ్బందీగా నిర్వహించాలి : కమిషనర్

అనంతపురం టౌన్, మార్చి 15: పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్స్, లైజన్ ఆపీసర్లను నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి ఆదేశించారు. అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం గ్రూప్-1 సర్వీసెస్ స్ర్కీనింగ్‌టెస్ట్ (అబ్జెక్టివ్‌టైప్) పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో 11,597 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరికోసం జిల్లా వ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10గంటల నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం2గంటలనుంచి సా యంత్రం 4గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఎక్కడా ఏచిన్న తప్పు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని చీఫ్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్‌లైట్స్, గాలి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సెంటర్ వద్ద తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పరీక్షాకేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులు రాంగ్ జంబ్లింగ్ జరగకుండా ఇన్విజలేటర్లు ముందుగానే తెలియజేయాలన్నారు. ఎలాంటి సెల్‌ఫోన్లు గానీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌గానీ అనుమతించబడవన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసినా ఏదైనా గుర్తింపుకార్డు తీసుకుని రావాలన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్. ఎస్డీపీలు ఆనంద్, శంకరయ్య, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 15: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ దూరవిద్య ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ విభాగాధికారి ప్రొఫెసర్ జీవీ రమణ, ఏసీ డాక్టర్ శ్రీరాములు నాయక్ ఫలితాలను వివరించారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలకు దాదాపు 630 విద్యార్థులు హాజరుగాకా 598మంది పాస్ అయ్యారన్నారు. 88శాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించారని, విద్యార్థులు వారి ఫలితాలకోసం మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

22న జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

అనంతపురం అర్బన్, మార్చి 15: జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని ఈనెల 22వతేదీ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సలహా మండలి సభ్యులు, వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఇక పాత మార్గంలోనే రైళ్లు

గుంతకల్లు, మార్చి 15: దారి మళ్లించి పంపిన కొన్ని రైళ్లను శుక్రవారం నుంచి తథాతథంగా పాత రూటులోనే నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనుల కారణంగా డోన్ మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను గత వారంలో దారి మళ్లించగా, పనులు పూర్తయిన కారణంగా ఆ డైవర్టెడ్ రైళ్లను పాత రూటులో పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. హౌరా-సత్యసాయి ప్రశాంతినిలయం సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 22831), దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22832)ను, పూరీ-యశ్వంతపూర్ వీక్లీ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22883) రైలును నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తిఫోర్ట్ స్టేషన్ల మీదుగా గత వారంలో మళ్లించారు. శుక్రవారం నుంచి ఈ రైళ్లను గుత్తి, డోన్, నంద్యాల స్టేషన్ల మీదుగా పునరుద్ధరించామని తెలిపారు.

అనంతపురంలో హంపి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

హుబ్లీ-మైసూరు-హుబ్లీ మధ్యన నడిచే హంపి ఎక్స్‌ప్రెస్ (నెం. 16591/92) అప్ అండ్ డౌన్ రైళ్లకు అనంతపురం స్టేషన్‌లో తాత్కాలిక స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మార్పు వెంటనే అమలులోకి వస్తుందని, ఈ స్టాపింగ్‌ను కొనసాగించేదీ, రద్దుపరచేదీ తర్వాత నిర్ణయిస్తామని అన్నారు.

హోలీకి అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

హోలీ పండుగను పురస్కరించుకుని తూర్పు మధ్య రైల్వే జోనల్ అధికారులు ముజ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ మధ్య గుంతకల్లు, అనంతపురం మీదుగా అప్ అండ్ డౌన్ రెండు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ముజ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ (నెం.05271) రైలును మార్చి 29, ఏప్రిల్ 5 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 05272) ఏప్రిల్ 1, 8 తేదీల్లోనూ నడపనున్నట్లు పేర్కొన్నారు. ముజ్ఫర్ నగర్-యశ్వంతపూర్ మధ్యన నడిచే రైలు పేర్కొన్న తేదీల్లో శుక్రవారం మధ్యాహ్నం మూడున్నరకు ముజ్ఫర్‌నగర్‌లో బయల్దేరి ఆదివారం సాయంత్రం 7 గంటల కు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు యశ్వంతపూర్‌లో పేర్కొన్న తేదీల్లో సోమ వారం ఉదయం ఏడున్నరకు బయలుదేరి ముజ్ఫర్‌నగర్‌కు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైళ్లు ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, కాచిగూడ, జనగామ, ఖాజీపేట్, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బాల్హార్షా, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, నర్సింగ్‌పూర్, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, ఆరా, పాటలీపుత్ర, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తాయని వెల్లడించారు.

జన సింధూరం..!

- టీడీపీ అభ్యర్థికి ఘనస్వాగతం
- పల్లె కోడలికి టిక్కెట్‌తో సంబరాలు



ప్రచార ర్యాలీలో పాల్గొన్న పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు

కొత్తచెరువు, మార్చి 15: పుట్టపర్తి టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరారెడ్డికి నియోజకవర్గంలో ఘనస్వాగతం లభించింది. అభ్యర్థిగా ప్రకటించాక తొలిసారి శుక్రవారం ఆమె నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కొత్తచెరువు మండలంలోని కొడపగానిపల్లి సమీపంలో ఆమెకు టీడీపీ, జనసేన శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. భారీఎత్తున రెండు పార్టీలవారు తరలివచ్చారు. ముందుగా ఆమె వెంకటాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో ఎన్నికల ప్రచార పత్రాన్ని నాయకులు, కార్యకర్తల నడుమ ఆవిష్కరించారు. అక్కడి నుంచి మూడు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. కొడపగానిపల్లి వద్ద గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతిపట్టారు. కొత్తచెరువుకు చేరుకోగానే మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా వందలాది మహిళలతో హారతులు పట్టించి, మొక్కలను కానుకగా ఇచ్చారు. కొత్తచెరువు జనసేన కార్యాలయానికి వెళ్లిన సింధూరను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళల అభివృద్ధికి పాటుపడతా..

పుట్టపర్తి నియోజకవర్గంలో మహిళల అభివృద్ధికి పాటుపడతానని పల్లె సింధూర అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ గతంలో తాను తిరిగానని, ప్రజల సమస్యలు, మహిళల పరిస్థితులు, రైతుల కష్టసుఖాలు తనకు తెలుసునని అన్నారు. అందరి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, విద్యార్థులపై దాడులు పెరిగాయనీ, ఈ ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని విమర్శించారు. ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతోందని అన్నారు. రైతులకు సబ్సిడీ పరికరాలు రాకపోవడంతో వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వైసీపీ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించారని, కానీ వారు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాబోవు ఎన్నికలలో టీడీపీని ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆయన కుమారుడు పల్లె వెంకటక్రిష్ణ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన సింధూర



టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి రాక సందర్భంగా కొడపగానిపల్లి నుంచి వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమె శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో కొత్తచెరువు సమీపానికి రాగానే భారీ జనసందోహం రావడం, విపరీతంగా పూలు చల్లడంతో సింధూరారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. రద్దీకితోడు ఎండ తీవ్రత కారణంగా ప్రచార రథంపై ఆమె సొమ్మసిల్లిపడిపోయారు. ఆమెకు తెలుగు మహిళలు సపర్యలు చేయడంతో కోలుకున్నారు. ఆ తరువాత ప్రచారాన్ని కొనసాగించారు.

చీనీ రైతును ముంచుతున్న దళారులు

- పులివెందుల తరహాలో బహిరంగ వేలం నిర్వహించాలి : రైతు సంఘం డిమాండ్

అనంతపురంరూరల్, మార్చి15: దళారుల వ్యవస్థతో చీనీ రైతులు నష్టపోతున్నారని, మార్కెట్‌లో చీనీ కాయలకు బహిరంగ వేలం నిర్వహించాలని జిల్లా పండ్లతోటల సంఘం నాయకులు, చీనీ రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం చీనీ మార్కెట్ యార్డులో మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి, మార్కెట్ చైర్మన్ ఏకే ఫయాజ్‌ను కలసి వారు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో సరైన సాగునీటి వసతి లేకపోయినా సొంతగా బోర్లు వేసుకొని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని జిల్లాలో అత్యధికంగా చీనీ సాగు చేసున్నారన్నారు. జిల్లాలో సుమారు 42,490 హెక్టార్లలో 10,62,260 టన్నుల చీని పంటను పండిస్తున్నారన్నారు. దళారుల కారణంగా గిట్టుబాటు ధర అందక రైతులు మోసపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనామ్ విధానంలో రైతుల కంటే కొనుగోలుదారులకే అధిక లాభమని అన్నారు. పులివెందుల మార్కెట్ యార్డు తరహాలో ఇక్కడ కూడా బహిరంగ వేలం ద్వారా చీనీకాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పండ్లతోటలకు అనుగుణంగా మార్కెట్‌లో షెడ్ల నిర్మాణం చేయాలన్నారు. చీనిపంటను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని, మార్కెట్ నిబంధనల మేరకు కమీషన్ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, రైతులు నాగలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతరాముడు, శివారెడ్డి, చెన్నారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, కుళ్లాయప్ప, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలకు మహిళ బలి

- మనస్తాపంతో ఆత్మహత్య


అరుణ (ఫైల్)

తాడిమర్రి, మార్చి 15: మండలంలోని కునుకుం ట్ల గ్రామంలో భూతగాదాలకు ఓ మహిళ బలైపోయింది. భూమి విషయంపై అన్నదమ్ములు ఘర్షణ పడుతుండడంతో.. తమ్ముడి భార్య అరుణ(30) ఆవేశానికి లోనై ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కునుకుంట్లకు చెందిన పెద్దవెంగముని, పెద్దక్కకు కుమారులు ప్రసాద్, చిన్నవెంగముని ఉన్నారు. తండ్రి నుంచి కుమారులకు సంక్రమించిన భూమి విషయంలో తగాదా ఏర్పడింది. దీనిపై గత శుక్రవారం పెద్దకుమారుడు ప్రసాద్.. తమ్ముడు చిన్నవెంగముని, తండ్రి వెంగమునిపై దాడి చేశాడు. దీంతో చిన్నవెంగముని తల పగిలి ఆరు కుట్లు పడగా.. పెద్ద వెంగమునికి చెయ్యి విరిగింది. గత బుధవారం వారికి ఉన్న చీనీ తోటలో ప్రసాద్ చీనీ కాయలు కోసేందుకు ప్రయత్నిస్తుండగా.. చిన్నవెంగముని, అతడి భార్య అరుణ భూతగదా తెగేవరకు కాయలు కోయరాదని అడ్డుపడ్డారు. కాయలు కోస్తే తమ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించినట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే అరుణ ఆవేశానికి లోనై అక్కడే ఉన్న గడ్డి మందు తాగింది. విషయం తెలుసుకున్న భర్త చిన్న వెంగముని వెంటనే ఆమెను ఆర్డీటీ ఆస్పత్రికి.. ఆ తరువాత అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కాగా బెంగళూరుకు తరలించే ముందు అరుణ మాట్లాడిందని, తనకు బలవంతంగా మందు తాపారని, తాపిన వారి పేర్లు కూడా చెప్పినట్లుగా చిన్నవెంగముని తెలిపారు. వీరికి కుమార్తె పల్లవి, కుమారుడు జశ్వంత్ ఉన్నారు. చిన్న వెంగముని అన్న ప్రసాద్, వదిన జయలక్ష్మి, వారి బంధువులు పెద్దగంగయ్య, చిన్న గంగయ్య, ప్రభాకర్, నారాయణస్వామి, వెంకటరమణ, చాకలి సత్యమయ్య.. తన భార్య మృతికి కారకులని చిన్నవెంగముని ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

రూ. 10.70 లక్షల నగదు స్వాధీనం

రాయదుర్గం, మార్చి 15: పట్టణంలోని గాలి మారెమ్మ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున రూ. 10.70 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి వస్తున్న లారీని తనిఖీ చేయగా విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన వేరుశనగ వ్యాపారి కుమ్మరి రామాంజనేయులు ఎలాంటి రశీదులు లేకుండా రూ. 10.70 లక్షలు తీసుకురావడం పోలీసులు గుర్తించారు. వ్యాపారంలో భాగంగా వేరుశనగను చెళ్లకెరలో విక్రయించి డబ్బును తీసుకెళుతున్నానని చెప్పడంతో దీనిపై పంచనామా నిర్వహించి డబ్బును రాయదుర్గం తహసీల్దార్‌కు అప్పగించినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

- షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప


కాళేశ్వర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శిల్ప

పెనుకొండ, మార్చి 15: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివసాయి మందిరం వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి కాళేశ్వర్ ఆశయ సాధన కోసం శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నామని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అన్నారు. శివసాయి మందిరంలో గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాళేశ్వర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు, ఆశ్రమ సిబ్బంది, పట్టణ ప్రముఖులు సాయి కాళేశ్వర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సాయికాళేశ్వర్ వర్ధంతి సందర్భంగా శివసాయి మందిరంలోని నవ్యశ్రీ ఆసుపత్రిలో శిల్ప ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆపరేషన్లకు 40 మందిని ఎంపిక చేశారు. గత వారంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు చేయించామని నిర్వాహకులు తెలిపారు.

కొలనులో పడి బాలుడి మృతి


హరికిరణ్(ఫైల్)

ఆత్మకూరు మార్చి 15: మండల పరిధిలోని సనప మాదవరాజులు స్వామి దేవాలయం కొలనులో హరికిరణ్(10) అనే బాలుడు పడి మృతిచెందాడు. ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన విరాలు మేరకు రామగిరి మండలం పోలేపల్లికి చెందిన హరికిరణ్ తల్లి తండ్రులతో కలసి మాదవరాజులు స్వామి ఉత్సవాలకు వచ్చారు. ఆలయం ఎదుట ఉన్న కోనేరు దగ్గర స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. గమనించిన స్థానికులు బయటికి తీసేలోగా మృతి చెందాడు. స్వామి దర్శనం కోసం వచ్చి కళ్లెదుటే కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

సూట్ లేకుండా చీనీకాయల కొనుగోలు

అనంతపురం రూరల్, మార్చి 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌లో సూట్ లేకుండా చీనీ కాయలు కొనుగోలు జరుగుతోందని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు తోటల వద్ద డబుల్ సూట్‌కు ఉత్పత్తులను అమ్ముకోవడం జరుగుతోందన్నారు. యార్డులో సూట్ లేకుండానే కొనుగోలు చేస్తారన్నారు.. అదేవిధంగా చీనీ వ్యాపారం చేయుటకు ఆసక్తి గల వారు, కొనుగోలు లైసెన్సు కొరకు కార్యాలయంలో సంప్రదించాలన్నా రు. వివరాలకు 96038 88166 నెంబరును సంప్రదించవచ్చునన్నారు.

కూటమి విజయం తథ్యం: బీకే



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, మార్చి 15: వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డి పాలనకు ఏపీ ప్రజలు చరమగీతం పాడతారని టీడీపీ, జనసేన బీజేపీ కూటమే విజయం సాధిస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏబీసీ, సీఓటరు, న్యూస్ 18, మెగా ఓపీఎన్‌లతో సర్వే ఫలితాలను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు. తెలుగుదేశంకు ప్రజలు పట్టం కడుతున్నట్లు జాతీయ మీడియా ప్రతినిధులు సంస్థలు నిర్వహించిన సర్వేలో కూటమికి 20 మెజార్టీ సీ ట్లు వస్తాయని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. జనగ్‌రెడ్డి గద్దెదిగే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ప్రజలు కూటమికి మద్దతుగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు వ్యతిరేకంగా ఈ సర్వే గణాంకాలే పేర్కొంటున్నాయన్నారు. సమావేశంలో కన్వీనర్ సిద్దలింగప్ప, తెలుగు రైతు అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, పెనుకొండ పట్టణ బీసీసెల్ అధ్యక్షులు శంకర్, గోనిపేట వెంకటేశ్ పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

అగళి, మార్చి 15: స్థానిక ఇరిగేపల్లి గ్రామంలో శుక్రవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీనాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి డా.సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పేదల అభ్యున్నతికే పార్టీ స్థాపించారన్నారు. పార్టీలో భేదాభిప్రాయాలు విడనాడి ప్రతి ఒక్కరూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును చేసేందుకు కంకణం కట్టుకోవాలన్నారు. అనంతరం కేక్‌కట్‌చేసి తినిపించుకున్నారు. జనసేన నాయకులు భాను ప్రకాశ్, రమేష్, రవి, రఘురాం, సీనియర్ నాయకులు ముకుందరెడ్డి, మంజు, చరణ్, ప్రవీణ్, అశోక్, మల్లేష్, మంజునాథ్, రంగనాథ్, నటరాజ్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

గోరంట్ల, మార్చి 15: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతమానుపల్లి అనాథాశ్రమంలో ఇద్దరు పిల్లలను చదివిస్తూ చేయూతనదిస్తానని ఆ పార్టీ నాయకుడు గొల్లపల్లి అనిల్‌కుమార్ యాదవ్ శుక్రవారం ప్రకటించారు. చింతమానుపల్లిలోని మంజుల చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో వారిని జనసే నాయకులు కలిసి చర్చించారు. ఆశ్రమ నిర్వాహకులు మంజులమ్మతో మాట్లాడుతూ ఒక బాలుడు, ఒక బాలికను ఐదేళ్లపాటు ప్రైవేటు పాఠశాలలో చదివించేందుకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జనసేన పార్టీ 12వ సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ, అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అదే బాటలో పయనించాలన్న ఉద్దేశ్యంలో సేవాకార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి సురేష్, మండలాధ్యక్షుడు సంతోష్, నాయకులు నరేష్, శ్రీనివాసులు, సుధాకర్, కావేరి ఉన్నారు.



అనాథాశ్రమంలోని పిల్లలతో జనసేన నాయకులు

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులు, నరేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 15: భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా నరేష్‌ను నియమించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్, ప్రజాపోరు యాత్ర పట్టణ కన్వీనర్ శంకర్ ఆధ్వర్యంలో కొత్తగా నియమితులైన వారిని సన్మానించారు. వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో బాధ్యాతాయుత పదవి అప్పగించినందుకు, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీకే బాబు, ఓబులేసు, చంద్రశేఖర్, బద్రీ, బండి కిష్టప్ప, లక్ష్మీనారాయణ, శేఖర్, సత్యనారాయణ, ఫక్రుద్దీన్, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం



కరపత్రాలు విడుదల చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 15: జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పరిగి మండలంలోని సేవామందిరం లింగణ్ణ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ ఇది వరకే విడుదల చేసిన కొన్ని సంక్షేమ పథకాల హామీ కరపత్రాలను వారు విడుదల చేశారు. పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బాలాజీ మనోహర్ మాట్లాడారు. జగన్ పాలనలో జనజీవనం అస్తవ్యస్తమైందన్నారు. శాంత భద్రతలు క్షీణించాయన్నారు. ఎక్కడ చూసినా దోపిడీలు దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రతి మండల, పంచాయతీ స్థాయిలో కరపత్రాలు ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. హిందూపురం ఏ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పట్టణాధ్యక్షుడు జమీల్, డీసీసీ ఉపాధ్యక్షుడు మాహబూబ్‌బాషా, మైనార్టీ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు సుబహాన్, ఆసీఫ్, బాబు, గంగాధరప్ప, నరసింహప్ప, కోటిపన్న, సంజీవప్ప, దాసన్న, ఈశ్వరప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ.. ప్రతిఒక్కరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మడకశిర రూరల్, మార్చి 15: ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు హక్కు వినియోజంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం నా మొదటి ఓటు, ఓటరు నమోదు, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం.. అభివృద్ధి: సవిత



కరపత్రాలు అందజేస్తున్న సవిత

పెనుకొండ రూరల్, మార్చి 15: సంక్షేమం, అభివృద్ధి పుట్టింది తెలుగుదేశం పార్టీతోనే అని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అతలాకులతలమైందని, పాడైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ఏకైక నాయకుడు చంద్రబాబే అని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాగలూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన, టీడీపీ శ్రేణులతో కలిసి జోరుగా ఆమె ప్రచారం నిర్వహించారు. తొలుత బండ్లపల్లి, నాగలూరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. నేను లోకల్ అని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు 24గంటలలు అందుబాటులో ఉంటానని ఓటర్లకు భరోసా కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నవరత్నాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టారన్నారు. ఒక చేత్తో పథకాలు ఇస్తూ మరోచేత్తో పన్నుల రూపంలో దోచుకున్నారన్నారు. దోచుకోవడం, దాచుకోవడంతప్ప పెనుకొండలో మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మంత్రి ఉషశ్రీ పెనుకొండకు అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ కన్వీనర్ శ్రీరాములు, అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, సర్పంచ్ శ్రీనివాసులు, చంద్రమౌళి, పోతిరెడ్డి, సూర్యనారాయణ, త్రివేంద్ర, జనసేన సమన్వయకర్త ఈడిగ కుమార్, తెలుగు మహిళలు చంద్రకాంతమ్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

సింహం బోనులోనే ఉండాలి

హిందూపురం: సింహం ప్రజల మధ్య కాదు బోనులో ఉండాలని టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. శుక్రవారం పరిగి మండల కేంద్రంలో టిక్కెట్ కేటాయించిన తరువాత తొలిసారి ఆమె విచ్చేశారు. వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎప్పుడూ చెబుతుంటారు ఎంతమంది జతకట్టినా సింహం సింగిల్‌గానే వస్తుందని, అయితే సింహం మనుషుల మధ్య ఉండకూడదు బోనులో ఉండాలని చలోక్తి విసిరారు. ఇక్కడకు ఎందరో వలసపక్షులు వస్తున్నారు, పోతున్నారు. అలానే మరో వలస పక్షి కళ్యాణదుర్గంలో దోచుకుంది చాలదని ఇప్పుడు పరిగి మండలంలో ఇసుకను దోచుకోవచ్చని ఇక్కడకు వచ్చిందని ఎద్దేవా చేశారు. నీవు డబ్బు ఆశ చూపిస్తే నియోజకవర్గ, పరిగి మండల ప్రజలు లొంగరన్నారు. ఒక్క చాన్స్‌తో ఐదేళ్ల ప్రజలు చాలా బాధలు పడ్డారన్నారు. ప్రతి గడపకు వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ఆమె వివరించారు. అనంతరం మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గజమాలలతో సవితమ్మను సన్మానించారు. మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమయ్య, మాజీ సర్పంచ్‌లు బాలాజీ, నాగప్ప, మోదా నారాయణరెడ్డి కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పరిగిలో గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

జగన్‌ను గద్దెదించాలి

● ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 15: రాష్ట్రంలో నిరుద్యోగులను ముంచిన సీఎం జగన్ రెడ్డిని గద్దె దించాలని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీజేపీ, టీడీపీ, జనసేనతో కలిసి పట్టణంలో ఏపీపీఎస్సీలో జరిగిన కుంబకోణానికి నిరసనగా ఆందోళన చేపట్టారు. అమరాపురంలో హౌస్ అరెస్టయిన సునీల్ కుమార్ పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి మడకశిరకు చేరుకొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ చేసేందుకు సిద్ధపడ్డారు. సీఐ మనోహర్, పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ జరగకుండా వారిని అడ్డగించారు. సీఐ, పోలీసులతో సునీల్‌కుమార్ గొడవకు దిగారు. వారు విలేకరులతో



మాజీ ఎమ్మెల్యే ఈరన్నను నిర్బంధించిన పోలీసులు



సునీల్‌కుమార్ అడ్డుకుంటున్న పోలీసులు

మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1లో రూ.150కోట్ల అవినీతి జరిగిందని, దానిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరిగిన ఉద్యోగాల భర్తీలో కేటీఆర్‌కు ఏవిధంగా బుద్ధి చెప్పారో వైసీపీ ప్రభుత్వానికి యువత అదేవిధంగా బుద్ధి చెబుతారన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, జనసేన అధ్యక్షుడు శివాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి ముందస్తు అరెస్టు

అమరాపురం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయమే ఇంటి వద్దకు వెళ్లి వారిని ఎక్కడికీ వెళ్లకుండా అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతును జగన్ నొక్కలేరని, ఏపీపీఎస్సీలో రూ.150కోట్ల కుంబకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. అమరాపురం బస్టాండు ఆవరణంలో జగన్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో అక్రమ అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారించండి

గుడిబండ, మార్చి 15: గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధశాఖల అధికారులు సర్పంచులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు వివిధశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లలో పైపులు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలన్నారు. బోర్లలో నీరు అడుగంటిపోయిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, ఏఓ నారాయణప్ప, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శులు, గోవిందప్ప, రమేష్, అమరేష్, దాదాఖలందర్, అజయ్, ధనలక్ష్మీ, హరీష్, సర్పంచులు పాల్గొన్నారు.

సర్వమంగళ స్వరూపిణి మారియమ్మ

హిందూపురం అర్బన్, మార్చి 15: సర్వమంగళ స్వరూపిణి మారియమ్మ అమ్మవారని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని శ్రీకంఠాపురంలో వెలసిన మారెమ్మ ఆలయానికి స్వామీజీ వచ్చారు. ఆయన మాట్లాడుతూ... శక్తిస్వరూపిణి అమ్మవారు మారియమ్మ అన్నారు. అమ్మవారిని కొలిస్తే దుష్టశక్తులు దరిచేరవన్నారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. స్వామీజీ ప్రవచనాలు వింటున్నంత సేపు భక్తులు లీనమైపోయారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రొద్దం, మార్చి 15: గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని రొద్దం కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ ఒక ప్రకటనలో కోరారు. ఆరు, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలు, బడిబయట ఉన్న చిన్నారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు ఇందుకు అర్హులన్నారు.

అవార్డు ప్రదానం

పావగడ, మార్చి 15: తాలూకాలోని ఇంద్రబెట్ట గ్రామానికి చెందిన డాక్టర్ ప్రేమజ్యోతికి 2024వ సంవత్సరానికిగాను కర్ణాటక మహిళా రత్న అవార్డు లభించింది. తాలూకాలోని మారుమూల గ్రామమైన ఇంద్రబెట్టలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రేమజ్యోతి ఆ గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం ముగించుకొని సమాజం, జాతి వ్యవస్థపై పోరాటం చేస్తూ విద్యారంగంలో అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం బెంగళూరులోని సంతె జోసఫ్ యూనివర్సిటీలో సహోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేసిన ఆమె సేవలను గుర్తించి దుర్గశ్రీ సంతోష్‌లాడ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకమైన కర్ణాటక మహిళారత్న అవార్డును బెంగళూరులో ఆమెకు అందించింది.



కర్ణాటక మహిళా రత్న అవార్డు అందుకుంటున్న ప్రేమజ్యోతి

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ రూరల్, మార్చి 15: వైసీపీ దౌర్జన్యాలు భరించలేక టీడీపీ పాలనలో తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో అడదాకులపల్లి గ్రామానికి చెందిన 13 వైసీపీ కుటుంబాలు టీడీపీ నాయకుడు రంగనాయకులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సవిత టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. బుట్టాచారి కుల్లాయప్ప, రమేష్, చక్రిరెడ్డి, జయరాంరెడ్డి, రాజారెడ్డి, అంజినరెడ్డి, దాల్‌మిషన్ రామిరెడ్డి, బోచ చంద్రప్ప, చిన్నకుల్లాయప్ప, పెద్దకుల్లాయప్ప, బోయసత్తి, చాకలి వెంకటేశ్ ఉన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

గోరంట్ల, మార్చి 15: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు గోపాల్, జాన్ రెడ్డెప్ప తెలిపారు. మండలంలోని 9 జిల్లాపరిషత్, కేజీబీవీ, గిరిజన బాలికల గురుకుల పాఠశాలతోపాటు, 8 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1,520మంది విద్యార్థులకు 18వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం న్యూమాంటీస్సోరీలో 300, చైతన్యఎలో 260, చైతన్యబిలో 150, బాలుర ఉన్నతపాఠశాలలో 260, బాలికల పాఠశాలలో 220, శ్రీవివేకానందలో 300 మంది పరీక్షలు రాయనున్నారు. 71 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఉర్దూ ఉన్నతపాఠశాల, ఉదయకిరణ్ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసి, ఈ ఏడాది నూతనంగా చైతన్యబి కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. బాలికల ఉన్నత పాఠశాలకు అవసరమైన డెస్కులను ఉర్దూ పాఠశాల నుంచి తరలించామన్నారు.

నాగలూరు గ్రామానికి మట్టిరోడ్డే దిక్కు

పెనుకొండ రూరల్, మార్చి 15: పెనుకొండ నియోజకవర్గానికి మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మంత్రి ఉషశ్రీ ఇన్‌చార్జిగా ఉన్నా మండలంలో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. ఎన్నికల ప్రచారాల్లో మాత్రం మీ గ్రామానికి రోడ్లు వేయిస్తాం, సమస్యలు పరిష్కరిస్తామని ఓట్లు వేయించుకుని గెలిచారేతప్ప నేటికీ రోడ్లు వేసిన పాపానపోలేదని మండలంలోని నాగలూరు గ్రామస్థులు వాపోతున్నారు. 20 ఏళ్లుగా గ్రామానికి మట్టి రోడ్డే దిక్కయ్యిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు రోడ్డు మరమ్మతులు చేయడానికి విన్నవించినా వారు పట్టించుకోలేదని అన్నారు. ఈసారి ఎన్నికల్లో రోడ్లు ఎవరు వేస్తారో వారికే ఓటు వేస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.



నాగలూరుగ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇదే...

సోలార్‌తో ప్రపంచానికి వెలుగునిస్తున్న పావగడ

● విద్యుత్ శాఖ మంత్రి జార్జ్

పావగడ, మార్చి 15: తాలూకాలోని తిరుమణి ప్రాంతంలో 23 వేల ఎకరాల్లో మూడువేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఇతర దేశాలకు సరఫరా చేస్తున్న పావగడ ప్రపంచ భూపటంల్లో నిలిచి పోతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.జె.జార్జ్ అన్నారు. శుక్రవారం తిరుమణిలో ఉన్న కేఆర్‌ఈడీసీఎల్ విద్యుత్ ఉపకేంద్రంలో రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక నుంచి సోలార్ విద్యుత్ కేంద్రంలో స్థానికులకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములను సోలార్‌కు ఉపయోగపడేందుకు వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు కల్పించి, కరవు ప్రాంతం అనే పేరును కనుమరుగయ్యేలా చేస్తామన్నారు. విండో సోలార్‌ను నెలకొల్పడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొందని పావగడ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సోలార్ ఒక గొప్ప వరం అని అన్నారు. ఫెడల్ సంస్థ అధ్యక్షుడు రాజేష్‌గౌడ, సోలార్ ఎండీ రుద్రయ్య, ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, సోలార్ మాజీ ఎండీ బలరామ్, సోలార్ కంపెనీ యజమని అమర్‌నాథ్, కాంగ్రెస్ నాయకుడు నాని పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న సోలార్ అధికారులు, ఎమ్మెల్యే వెంకటేష్ తదితరులు

జగన్‌ను సాగనంపే రోజులు దగ్గరపడ్డాయ్

పెనుకొండ టౌన్, మార్చి 15: వైసీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి జగన్‌ను సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే మెజార్టీ అని పలు మీడియా సంస్థలు అంచనా వేశాయన్నారు. జగన్ అక్రమ, అవినీతి పాలన ముగింపు దశకు చరుకుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిన జగన్‌మోహన్‌రెడ్డి రూ.150కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాని ఆరోపించారు. సంతలో పశులను అమ్ముకున్నట్లు ఉద్యోగాలను జగన్ అమ్ముకున్నాడన్నారు. చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, జనసేన నాయకులు కుమార్, రఘువీరాచౌదరి, కోనాపురం రాజలింగ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కొడికొండలో కవాతు చేస్తున్న పోలీసులు

చిలమత్తూరు, మార్చి 15: త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని కొడికొండ, సోమఘట్ట గ్రామాల్లో హిందూపురం డీఎస్పీ కంజక్షన్, సీఐ ఈరన్న, ఎస్.ఐ గంగాధర్, 131 బెటాలియన్ పోలీసులు, బిఎస్ఎఫ్ సిబ్బంది కవాతు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కవాతు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా గతంలో అల్లర్లకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి, వారిని పోలీసుల నిఘాలో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సందర్భంగా ప్రశాంతతకు భంగం కలగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. పోలీసులు సోమఘట్ట, కొడికొండ గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా కవాతు చేశారు.

సమస్యాత్మక గ్రామలపై దృష్టి సారించాలి

గుడిబండ, మార్చి 15: వచ్చే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా, రాంభూపాల్‌రెడ్డి, ఆర్‌ఐ మహ్మద్ బిలాల్, ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా: డీఎస్పీ

మడకశిరటౌన్, మార్చి 15: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో గట్టి నిఘా ఉంచుతామని పెనుకొండ డీఎస్పీ షేక్ బాబ్జాన్ సయ్యద్, కర్ణాటక డీఎస్పీలు శేఖర్, రామచంద్రప్ప అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం సరిహద్దు ప్రాంతాల పోలీసులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. సీఐలు మనోహర్, రాజశేఖర్‌తోపాటు, ఆంధ్ర,కర్ణాటక సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

అగళి, మార్చి 15: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలవద్ద అవసరమైన అవసతులు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అగళి, ఇరిగేపల్లి, మధుడి, నర్సంబూది, రామనపల్లి, కోడిపల్లి, తదితర గ్రామాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఆర్‌ఐ గుర్రన్న పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి

చిరుధాన్యాల వాడకంపై అవగాహన

అగళి, మార్చి 15: మండలంలోని కసాపురం గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాల వాకడంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల పౌష్టికాహారం లభిస్తుందన్నారు. అన్ని రకాల పౌష్టిక విలువలు కలిగిన పదార్థాలను ప్రదర్శనలో ఉంచి అవగాహన కల్పించారు. మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు, తినడంవల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. సూపర్‌వైజర్ లీలావతి, ఉపాధ్యాయులు రమాదేవి, జగజ్యోతి, పుష్ప, ఆశ, అంగనవాడీ కార్యకర్తలు తిమ్మక్క, అనిత, గంగమ్మ, కామాక్షి లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లీశ్వరి

శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి



ప్రాజెక్ట్‌లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, మార్చి 15: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా హుండాయ్, మొబిస్ సంస్థవారు గుట్టూరు జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు ప్రాజెక్ట్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుండాయ్, మోబిస్ సంస్థవారు ప్రాజెక్ట్‌లపై వివరించే ప్రతి విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు, హుండయ్, మోబీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మార్చి 15: పట్టణ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ లక్ష్మీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సడ్లపల్లి ఫీడర్‌లో ప్రశాంతినగర్, టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డు, ఎస్ సడ్లపల్లి ఆటోనగర్, వీవర్స్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సైనిక్ స్కూల్‌కు ఐదుగురి ఎంపిక

గుడిబండ, మార్చి 15: ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వర్ష సైనిక్ స్కూల్ ప్రతినిధి శ్రీనివాసులు తెలిపారు. గుడిబండ వర్షా సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎన్.ఉల్లాస్‌గౌడ్, మాన్యశ్రీ రుక్సానాబాను, షాహీన్‌తాజ్ ప్రతిభ కనబరచినట్లు ఆయన తెలిపారు. ఉత్తీర్ణత విద్యార్థులను ఆయన అభినందించారు. స్కూల్ యాజమాన్యం షబ్బీర్, తిమ్మప్ప, శివకుమార్, శ్రీరామప్ప పాల్గొన్నారు.